31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శనివారం 25 ఏప్రిల్ 2026 | పేజీలు : 8

## వేములవాడ రాజన్న ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు



చురకలు ప్రతినిధి సిరిసిల్ల ఏప్రిల్ 24 : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం ఐపీఎస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు. తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం



డీజీపీ శివధర్ రెడ్డి





చురకలు ప్రతినిధి సిరిసిల్ల ఏప్రిల్ 24 : రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డీజీపీ బీ శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ. 2 కోట్ల 50 లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ బీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలె క్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీజీపీ బీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయి జం అంతమైందని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసింగ్‌లో నూతన మార్పులు తీసుకు వస్తామని వెల్లడించారు. ప్రజల కేంద్రం గానే సేవలు అందించేలా పోలీసులకు శిక్షణ ఇస్తామని, అదే స్థాయిలో విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించా లని, ద్విచక్ర వాహనదారులు తప్పనిస రిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహన దారుడు 2లో





## జనగణన 2027
## విజయవంతంగా నిర్వహించాలి



జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్

చురకలు విలేకరి, కోరుట్ల, ఏప్రిల్ 24: జనగణన-2027 విజయవంతంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జనగణన-2027 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఎంపికైన ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లకు శుక్రవారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు. ఖచ్చితమైన గణాంకాలు సేకరించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పన అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని చెప్పారు. ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి వివరాల సేకరణ విధానం డిజిటల్ పద్ధతుల్లో డేటా నమోదు, ప్రజలతో × వ్యవహరించే తీరు గోప్యత పరిరక్షణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఫీల్డ్లో ఎదురయ్యే సమస్యలు వాటి పరిష్కారాలపై కూడా మార్గదర్శకాలు ఇచ్చారు. జిల్లాలో జనగణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని, ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సహకారం లేకుండా జనగణన విజయవంతం కాదన్నారు. కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, తహసీల్దార్లు, శిక్షకులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## రైతుభరోసా కేవలం ప్రకటనలకే పరిమితమైంది

- రైతుభరోసా అందించి రైతులను ఆదుకోవాలి
- గత ప్రభుత్వం రైతుబంధు అందిస్తే ఈ ప్రభుత్వం ఎగ్గొడుతుంది
- ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలి.
- మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



చురకలు విలేకరి, రాయికల్, ఏప్రిల్ 24 : రైతు భరోసా కేవలం ప్రకటనలకే పరిమితమైందని, రైతుభరోసా అందించి రైతులను ఆదుకోవాలని, గత ప్రభుత్వం రైతుబంధు అందిస్తే ఈ ప్రభుత్వం ఎగ్గొడుతుందని, ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగానికి రైతుబంధు పథకాన్ని ప్రవేశపెడితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ. 15వేలు ఇస్తామని, ఇప్పుడు రైతుభరోసాను రెండే ఎకరాలకు పరిమితం చేశారన్నారు. కేసిఆర్ జగిత్యాలలో సభ పెడితే సీఎం రేవంత్రెడ్డి మేడిగడ్డ వద్ద సభ నిర్వహించి రెండు ఎకరాలు భూమిగల రైతులకు రైతుబంధు ప్రకటించారని, గతంలో వరి, మొక్కజొన్నలను ఏ విధమైన ఆంక్షలు లేకుండా కొనుగోలు చేశారని, ఇప్పుడు మొక్కజొన్నను ఎకరాకు 25 క్వింటాళ్లకు పరిమితం చేశారని, అది కూడా యాప్ లో నమోదు చేస్తేనే కొనుగోలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయడం లేదని, 25 క్వింటాళ్ల లిమిట్ వల్ల మద్దతు ధర 2400

-2లో

## డంపింగ్ యార్డ్ రద్దు కోసం
## ఎంతటి పోరాటానికైనా సిద్ధం



చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 24 : హుజురాబాద్ శివారులో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ రద్దు కోసం ఎంతటి పోరాటానికైనా కార్యకర్తలు ప్రజలు సిద్ధంగా ఉండాలని, పోరాటాలతో ప్రభుత్వం మెడలు వంచాలని కేంద్రమంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా రాస్తారోకో నిర్వహించారు. సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని రద్దు చేసుకోకపోతే తీవ్రమైన పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఒకవైపు జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంటే దాని పక్కనే డంపింగ్ యార్డ్ నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్ నిర్మాణంతో రైతులు మహిళలు పిల్లలు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడతారని, పర్యావరణం దెబ్బతింటుందని, కాలుష్యం ఎక్కువ అవుతుందని ప్రజలు ఇక్కడ నివసించలేని పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎందుకు మొండి పట్టుదలతో వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. రేపు ప్రజల ఉద్యమిస్తుంటే మరోవైపు జేఏసీ ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వాన్ని నిమ్మకు నీరు ఎత్తెనట్టుగా ఉండడం దారుణం అన్నారు. డంపింగ్ యార్డ్ అడ్డుకునేందుకు -2లో

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**చురకలు విలేకరి,గొల్లపల్లి,ఏప్రిల్ 24 :** గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో గురువారం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యంకొనుగోలు కేంద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. కాగా అబ్బాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గానికి సమాచారం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం వివాదానికి దారి తీసింది.అబ్బాపూర్ టిఆర్ఎస్ పార్టీకి చెందిన దళిత మహిళ సర్పంచ్ కాగా సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చెవుల రవీందర్ కొనుగోలు ప్రారంభించిన అధికారులు, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 24 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పలు గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం మార్కెట్ కమిటీ ఇంచార్జి చైర్మన్ గోల్ల తిరుపతి ప్రారంభించారు.వెంకటాపూర్, పాశిగాం, స్థంభంపల్లి,చర్లపల్లి, జగదేవుపేట, కొండాపూర్, రాజారాంపల్లి,ఎండపల్లి, గుల్లకోట గ్రామాల్లో రెండు ఐకెపి ఏడు సొసైటీ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఆయాగ్రామాలసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ రద్దు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం



**మొదటి పేజీ తరువాయి...** ఎంతకైనా తెగిస్తామని అవసరమైతే కేసులు ఎదుర్కొంటామని జైళ్లకు కూడా వెళతామని ఆయన స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ పై ప్రభుత్వం ఇలాగే మొండి పట్టుదలతో ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, మానవ హక్కుల మిషన్ ను, ఎస్సీ ఎస్టీ కమిషన్లను కూడా ఆశ్రయిస్తామని తెలిపారు. త్వరలోనే గవర్నర్ ను కూడా కలిసి డంపింగ్ యార్డ్ రద్దు కోసం వినతి పత్రం సమర్పిస్తామని వెల్లడించారు. డంపింగ్ యార్డ్ ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బిజెపి నాయకులు తూర్పాటి రాజు, గంగిశెట్టి రాజు, యాంసాని శశిధర్, కొలుగోరి సుమలత, దామెర అనూష అనురాగ్, పైళ్ల వెంకట్ రెడ్డి, నల్ల సుమన్, క్యాస వెంకటేష్, పంజాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుభరోసా కేవలం ప్రకటనలకే పరిమితమైంది

**మొదటి పేజీ తరువాయి....**ఉంటే బయట అమ్ముకుంటే 1800 ఇస్తున్నారని, రైతులు క్వింటాలకు 600 నష్టపోతున్నారన్నారు. రుణమాఫీ ఆశించిన స్థాయిలో జరగలేదని, రైతు భరోసా కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమిత మైందన్నారు. పిఏసిఎస్ కాల పరిమితి ముగిసి సంవత్సర కాలం గడుస్తుందని, రైతాంగానికి సంబంధించి ధాన్యం సేకరణ, ఎరువుల పంపిణీలను పర్యవేక్షించేది పిఏసిఎస్ లేనన్నారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోని సొసైటీలను నామినేట్ చేయకుండా పాత పద్ధతిలో నే ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం

**మొదటి పేజీ తరువాయి...**తమ కోసం.. తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాల తో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడంలేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూ చించారు. పౌరులు బాగుంటే రాష్ట్రం.. దేశ అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే అరైవ్.. అలైవ్ కార్యక్ర మాన్ని అమలు చేస్తున్నామని వెల్లడిం చారు. వేములవాడ పట్టణంలో శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఉన్న నేపథ్యం లో వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నానని తెలిపారు. వేముల వాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అండగా ఉంటున్నారని చెప్పారు.

**ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకం**

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. అన్ని సెలవుల్లో వారు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశా రు. అరైవ్.. అలైవ్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని వెల్లడించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, మూలవాగు పై మూడో బ్రిడ్జి పనులు చేయిస్తున్నామని, రుద్రంగికి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు అయిందని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వేములవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,మహిళా పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, వేములవాడలో ఆలయ భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని డీజీపీని కోరారు. రుద్రంగి, భీమారంలో రెవెన్యూ, మండల పరిషత్ భవనాలు ఇస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామి కావడం అదృష్టమని పేర్కొన్నారు.

**నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకం**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత.. మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణా నికి ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, మహా శివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరిలో జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించామని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణలో భాగంగా జిల్లాలో ఇటీవల అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో నో హెల్మెట్.. నో ఎంట్రీ అమలు చేస్తున్నామని, ఇప్పటికే అన్ని గ్రామాల సేఫ్టీ కమిటీలకు తెలిపామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

నేరాల నియంత్రణ కోసం.. జిల్లాలోని రుద్రంగి మండలం చిన్నదని, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. మండల ప్రజల సహకారంతో మండల కేంద్రంలో నేరాల నియంత్రణ కోసం ఇటీవల హై క్వాలిటీ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఇూచీూ=) సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పోలీస్ స్టేషన్ ద్వారా మండల ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే కాకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు. అరైవ్.. అలైవ్ కింద జిల్లాలోని ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆటో మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని, సీపీఆర్, ప్రాథమిక ఆరోగ్య చికిత్స పై అవగాహన కల్పించామని వెల్లడించారు.

రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ఈత సరదా కాకూడదు విషాదం ...!








**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఎప్రిల్ (24) :** పిల్లలకు విద్యాసం వత్సరం ముగియడంతో విద్యార్థులకు ప్రభుత్వం వేసవిసెలవులు ప్రకటించింది. దీంతో విద్యార్థులు తమ తమ ఇళ్లకు చేరుకున్నారు.తమ స్నేహితులతో కలసి ఆహ్లాదం, ఆనందం కోసం సమీపంలోని చెరువులు,కుంటలు, బావులు, కెనాల్లో ఈత కొట్టి స్నానాలు చేస్తూ సమయం గడుపుతారు. కానీ ఈత సరదా విషాదంగా మిగలకూడదని, పిల్లల పనితీరును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమర్ జిల్లాలోని పోలీస్ అధికా రులు, సిబ్బందికి ఇదివరకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో మైక్ , డప్పు చాటింపు చేసి పిల్లల.తల్లిదండ్రులను అప్ర మత్తం చేశారు. ఎస్సారెస్పీ కెనాల్, చెరువులు, కుంటలు, బావుల వద్ద పలు సూచనలతో కూడి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీం పట్నం మండలం గోదూరు, తిమ్మాపుర్, తిమ్మాపూర్ తండా, బర్దిపూర్,యామ పూర్, వేములకుర్తి, ములరాంపూర్, ఎర్దండి, కొమటికోండాపూర్, వర్షకొండ, డబ్బా, అమ్మక్కపేట, ఎర్రపూర్, ఇబ్రహీం పట్నం, కేశాపూర్, కొజన్ కోత్తురు గ్రామాల్లో గ్రామాల ప్రజాప్రతినిధులను, పలు సంఘాల నాయకులను గ్రామాల పిల్లలను అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని మెట్ పల్లి డిఎస్పీ రాములు , సీఐ ఆదేశాల మేరకు రోజు వారిగా పిల్లల తమ మిత్రులతో ఏలా మెదులు తున్నారో పరిశీలించాలని, అవసరమైతే ఆకతాయిలతో స్నేహం చేయకుండా చూసుకోవడం మంచిదని, రోజు పుస్తకాలు, క్రీడాలపై దృష్టి సారించేలా చూసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవిన్ కుమార్ అవగాహన కల్పించారు.

**తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.**

**-ఇబ్రహింపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్**

వేసవికాలంలో పాఠశాలలు, కళాశాల లకు సెలవులు రావడంతో పిల్లలు, యువకులు ఎండ వేడి నుంచి సేద తీరటానికి, ఈత నేర్చుకోవడానికి చెరు వులు ,కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇట్టి క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జరుగుతుండటం వలన అందరూ ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదు ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈత ను నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలి.

# పట్టణంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నాం

**-సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం**
**-జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 24 :** పట్టణంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామని,సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం చైర్పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో రాబోవు వర్ష కాలం దృష్ట్యా పట్టణ పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్,కెమికల్స్,ఫాగింగ్ మెషిన్స్,బ్యాక్ హో లోడర్,బ్యాటరీ స్ప్రే మిషన్స్, వేహికిల్ మౌంటెడ్ ఫాగింగ్ మిషన్ల కొనుగోలుకు రూ.0.90కోట్లు నిధులు, బక్రీద్ పండుగ ఏర్పాట్లకు నిధులు 10.06 కోట్లు,జంక్షన్ ఫౌంటెన్ మరమ్మత్తులు,రోటరీ పార్క్లో ఫౌంటేన్, పార్కు అభివృద్ధి పనులకు నిధులు రూ. 0.19కోట్లు,ప్రస్తుత వేసవి కాలము దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లీకేజిలను త్వరితగతిన అరికట్టడానికి నిధులు,పారిశుధ్య వాహనాలకు మైక్స్ ఏర్పాటు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ,లీకేజిలను రిపేర్ చేయడానికి కౌన్సిల్లో తీర్మాణించి ఆమో దించినట్లు తెలిపారు.ఈ సమా వేశంలో (25) అజెండా అంశాలు ప్రవేశ పెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. పలువురు సభ్యులు పలు సమస్యలను చైర్పర్సన్ దృష్టికి తీసుకరాగా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను చైర్పర్సన్ ఆదేశించారు.ఈ సమావేశంలో వైస్ చైర్పర్సన్ జీనత్ పర్వీన్ మునీరొద్దీన్, కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు, మునిసి పల్ కమీషనర్ హెచ్ఎం.స్పందన, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీయర్లు అనిల్,లక్ష్మి,టి.పి.ఓ.శ్రీనివాస్, టి.పి. ఎస్.అశోక్,జె.ఏ.ఓ.గణేష్ మునిసిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఏకగ్రీవంగా జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక




**చురకలు ప్రతినిధి, జగిత్యాల,ఏప్రిల్ 24 :** జగిత్యాల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవమైంది. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నలుగురు కోఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఈ సందర్భంగా వీరబత్తిని పద్మజ,గట్టు సతీష్,తస్లీమ్ సుల్తానా, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ లు కోఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కాగా, వారికి ఎన్నికల అధికారి ధృవీకరణపత్రాలను అందించారు. అనంతరం ఎన్నికైన కోఆప్షన్ సభ్యులను మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్,వైస్ చైర్పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా,కమిషనర్ స్పందన, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

## వెల్గటూర్ జిపిలో పంచాయతీరాజ్ దినోత్సవం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 24 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం గ్రామ పంచాయతీ కార్యాలయం లో శుక్రవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఉప సర్పంచ్ గండ్ర ప్రతాప్ రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ రాజ్ వ్యవస్థ పనిచేస్తుందని, 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలకు సంక్రమించిన అధికారాలు, బాధ్యతలను సమావేశంలో చర్చించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని గ్రామ సభల ద్వారా వార్డుల సమస్యలు పరిష్కరించుకోవాలని, గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత కు ప్రజలు సహకరించాలని తెలిపారు. అందరి సహకారంతో వెల్గటూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని పాలకవర్గం పేర్కొంది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**-జగిత్యాల జిల్లా డిఆర్డిఓ రఘువరన్**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (24) :** మహిళలు అన్ని రంగా ల్లో రాణించాలని జగిత్యాల జిల్లా డిఆర్డిఓ రఘువరన్ అనర్ ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో శుక్రవారం మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిబిరాన్ని పాత ఐకెపి భవనంలో ఏర్పాటు చేయగా ప్రారంభించారు.అనంతరం అమ్మకపేట గ్రామానికి చెందిన మమత అనే సభ్యురాలికి ఎలక్ట్రిక్ ఆటో స్త్రీ నిధి బ్యాంకు ద్వారా మంజూరు చేయగా మూడు లక్షల ఈ యూనిట్.. స్త్రీనిధి ద్వారా పిడి డిఆర్డిఏ రఘువరన్ ప్రారంభించారు.అనంతరం మాట్లాడు తూ మహిళలు అని రంగాల్లో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వరప్రసాద్, ఏపీఎం శంకర్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం

**-కోర్టు నిర్ణయాన్ని తుంగలో తొక్కిన సర్కార్**



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఏప్రిల్ 24 :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఎన్నికలకు వెళ్లకుండా నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి వర్గ నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం రైతువ్యతిరేక ప్రభుత్వమని తేటతెల్లమైందని మండల మాజీ పిఏసిఎస్ చైర్మన్ లు మండిపడ్డారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సహకార సంఘానికి కనీస ఆర్థిక సహకారం ఉండకపోగా రైతులు ద్వారా నడిచే వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ఖర్చులకు వాడుకోవడానికి స్కాములు చేయడానికి నామినేటెడ్ విధానాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా లేదని గుర్తించి నేరుగా ఎన్నికలు నిర్వహిస్తే గెలిచే అవకాశం లేదని ఈ నిర్ణయానికి పూనుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు బందు ఇవ్వకుండా పండించిన ధాన్యం సరిగా కొనుగోలు చేయకపోవడంతో రైతాంగంలో ఉన్న ఆసంతృప్తిని ప్రభుత్వం ఎన్నికలను ఎదుర్కొనే దమ్ములేకనే రాజకీయ కుయుక్తులు చేస్తోందన్నారు. నామినేటెడ్ పద్ధతిని అనుసరించడం దారుణమని హైకోర్టు కూడా కొట్టేసి పాత చైర్మన్లను నియమించాలనిరైతు సంఘాల్లో అధికారుల పాలన ఉండవద్దని కోర్టు తెలిపి మళ్లీ ఎన్నికలకు పోవాలని సూచించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కోర్టు నిర్ణయాన్ని తుంగలో తొక్కి నామినేటెడ్ విధానంతో వెళ్లడం దారుణమని, వెంటనే ఎన్నికలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్లు బద్దం అంజిరెడ్డి, నేరేళ్ల మోహన్ రెడ్డి, సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ముద్దం శరత్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, నల్ల రాజేశ్వర్, ఉయ్యాల లక్ష్మణ్, రాజలింగం, లింగస్వామి రైతులు తదితరులున్నారు.

# శంకర్ గౌడ్ ఆత్మబలిదానం కలచివేసింది

**-కార్మికుల హక్కుల కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలి : డాక్టర్ రఘు చిట్నేని**



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 24 :** నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానం తీవ్రంగా కలచివేసిందని ప్రముఖ వైద్యుడు సామాజిక సేవకుడు డాక్టర్ రఘు చిట్నేని శుక్రవారం తెలిపారు హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఒక కార్మికుడిని కోల్పోవడం సమాజా నికి తీరని లోటని పేర్కొన్నారు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమని అన్నారు ఆత్మహత్యలు ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కావని స్పష్టం చేసిన ఆయన మరణం నిశ్శబ్దాన్ని మిగిలిస్తుందని కానీ పోరాటానికి సజీవ గొంతుక అవసరమని తెలిపారు. కార్మి కులు నిరాశకు లోనుకాకుండా ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు కుటుంబాలను అనాథలుగా మార్చే నిర్ణయాలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు.మన హక్కుల కోసం ఐక్యంగా పోరాడితే విజయం సాధ్యమని పేర్కొన్న ఆయన ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడాలని సూచించారు శంకర్ గౌడ్ మరణానికి నైతిక బాధ్యత వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వారికి రావాల్సిన ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా అందించాలని కోరారు చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని కార్మికుల ఆవేదనను ప్రభుత్వం గౌరవంగా వినాలని సూచించారు ఇలాంటి విషాద ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్మికుల సంక్షేమమే సమాజ ప్రగతికి పునాది అని పేర్కొన్నారు శంకర్ గౌడ్ త్యాగం వృథా కాకుండా న్యాయం జరగాలని డాక్టర్ రఘు ఆకాంక్షించారు.

# బీహార్ హమాలీలు లేక నిలిచిపోయిన కొనుగోళ్లు

**చురకలు ప్రతినిధి ఎలా రెడ్డిపేట ఏప్రిల్ 24 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా ఆగర్వాల్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలంలో సింగిల్ విండోల ద్వారా 10సెంటర్లు ఐకెపి సెంటర్ల ఆధ్వర్యంలో 13 సెంటర్లు వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ డీఎస్ఓ బుచ్చిబాబు డిఎం నరసింహ సహకార సంఘాల స్పెషలా ఫీసర్ శంషోద్దీన్ ఏఎంసి చైర్మన్ షేక్ సభేరా భేగంగౌస్ పాలకవర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్యలు ఆయా గ్రామాల సర్పంచు లతో కలిసి చకచకా ప్రారంభించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్



మిల్లను కేటాయిస్తూ 500 300,250 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోళ్ళు చేయాలని ఆదేశాలిస్తూ అలాట్ చేశారు, కానీ తూకాలు వేసేందుకు స్థానిక హమాలీల కొరత ఏర్పడి కొన్నిచోట్ల వరి ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోయాయి, గత వర్షాకాలంలో బీహార్ హమాలీలతో తూకాలు వేయించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు అదే బీహార్ హమాలీలను ఇక్కడకు రప్పించి వరిధాన్యం కొనుగోళ్ళను ప్రారంభించాలని భావిస్తున్నారు.బీహార్ హమాలీలు సకాలంలో రాకపోవడంతో కొనుగోళ్ళు అక్కడక్కడ నిలిచిపోయాయి .రైతులు ఆయా కొనుగోలు కేంద్రాల్లో వడ్లకు 17శాతం మ్యాచర్ వచ్చే విధంగా వారంరోజులపాటు శ్రమించి ఆరబోసి కుప్పలు చేసి పరదలను కిరాయికి తెచ్చి కప్పులు వేశారు.వర్షం వచ్చినప్పటికీ తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అయినప్పటికీ వర్షం వచ్చినప్పుడల్లా ఆకాశం మేఘావృతమైనప్పుడల్లా మ్యాచర్ వచ్చిన వడ్లు తడిసిపోతాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా అధికార యంత్రాంగం చేతులు కాలకముందే ఆకులు పట్టిన చందంగా బీహార్ హమాలీలను త్వరగా రప్పించి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని చకచకా కొనుగోళ్ళు చేపట్టి అలాట్ చేసిన రైస్‌మిల్లులకు తరలించాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

# ఆర్టీసీ కార్మికులు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు

**-కుటుంబాలను వీధిపాలు చేయవద్దు**
**-జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 24 :** ఆర్టీసీ కార్మికులు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని కుటుంబాలను వీధిపాలు చేయవద్దని జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారిబాల్రెడ్డిలు కోరారు.ఎల్లారెడ్డిపేటమండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ బలవన్మరణం పట్ల వారు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.శంకర్‌గౌడ్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా ఉండాలని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు.శంకర్‌గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ధైర్యం,మనోబలం కలగాలని ప్రార్థించారు.ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు.ఏప్రిల్ 22,బుధ వారం మొదటి డ్యూటీ నుంచి సమ్మెకు పిలుపునిచ్చారని ప్రభుత్వం నుంచి చర్చలకు అధికారికఆహ్వానం,డిమాండ్ల పై స్పష్టమైన హామీ Christians



సమ్మెకు ఆర్టీసీ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ)పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు .ఆర్టీసీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని వారు కోరారు.న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆర్టీసీకార్మికులు శాంతి యుతంగా సమస్యలను సమ్మె ద్వారా పరిష్కరించుకోవాలని తమ సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు ప్రకటించారు.విలేకర్ల సమావేశం లో ఆర్కె ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ రైట్స్ అండ్ హ్యూమన్ రైట్స్ స్టేట్ డిప్యూటీ చైర్మన్ మహమ్మద్ లాలా , కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరే శ్రీనివాస్ గౌడ్ కస్తూరి ప్రవీణ్ రెడ్డి ఆశన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశం చేసిన

# ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుకు నూతన వస్త్రాలు

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 24 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నూతన గృహప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు దోమల లత భాస్కర్ దంపతులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతన వస్త్రాలను శు క్రవారం అందజేశారు.సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తన సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్ల లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకుంటున్నా సందర్భంగా వారికి నూతన వస్త్రాలను సారేగా అందజేస్తున్నారు అందులో భాగంగా దోమల లత భాస్కర్ దంపతులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నూతన



వస్త్రాలను అందజేశారు, ఈ సందర్భంగా లబ్ధిదారులు దోమల లతా భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం వల్ల నేను ఇల్లు కట్టుకోగలిగినానని సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల గ్రామ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య హౌసింగ్ ఏఈ చైతన్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటీ నరసయ్య పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్ని బాబు ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ భాయ్ ప్రధాన కార్యదర్శి వంగ గిరిదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనీయర్ నాయకులు బండారి బాల్రెడ్డి గుర్రపు రాములు గంట బుచ్చాగౌడు మద్దుల శ్రీపాల్ రెడ్డి మిరియల్కర్ చందు నవాబ్ సోషల్ మీడియా ప్రతినిధి బిపేట రాజ్ కుమార్ ఇలియాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# అన్వర్ ఛాలెంజర్స్ జట్టు ఘన విజయం



**చురకలు ప్రజలు కమాన్‌పూర్ ఏప్రిల్ 24 :** కమాన్‌పూర్ మండల కేంద్రం లో జరుగుతున్న కేపీఎల్ క్రికెట్ పోటీల్లో అన్వర్ చాలెంజర్స్ జట్టు మెదటి విజయం సాధించింది.అన్వర్ ఛాలెంజర్స్ టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకున్నారు.మెదటగా బ్యాటింగ్ చేసిన దుద్దిళ్ల సైన్యం జట్టు 10వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది.ప్రవీణ్ 24,కొండన్న11,సాదిక్ 8పరుగులు చేశారు.అనంతరం ఛేజింగ్ కి దిగిన అన్వర్ ఛాలెంజెర్స్ మరో 10బంతులు మిగిలి వుండగానే విజయం సాధించింది.ఇందులో అఫ్రోజ్ 18,అజయ్ 16, అనిల్ 12, సాయిరాం 9 పరుగులు చేసారు.మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అఫ్రోజ్ ఎంపికయ్యారు.అన్వర్ చాలెంజర్స్ జట్టు యజమాని సయ్యద్ అన్వర్ కీ పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.అన్వర్ చాలెంజర్స్ బౌలర్ దినేష్ తను వేసిన 2 ఓవర్లలో కేవలం 5 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీసి జట్టులో బెస్ట్ బౌలర్ గా నిలిచాడు.అలాగే రమేష్ కూడా 2 ఓవర్స్‌లో 2వికెట్లు తీసి 13 పరుగులు ఇచ్చాడు.

# సత్యసాయి 15వ ఆరాదన దినోత్సవం

**-రాచర్ల గొల్లపల్లి - బొప్పాపూర్**

**సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 24 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి - బొప్పాపూర్ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా వారి 15వ ఆరాధన దినోత్సవం సందర్భంగా మందిరంలో ఉదయం ప్రాతఃకాళ సమయంలో జ్యోతి ధ్యానం,సుప్రభాతం,వేద పఠనం,నగర సంకీర్తన,అనంతరం ఉదయం 9గంటకు స్వామివారికి అభిషేకము,అష్టోత్తర పూజ, పాదాభిషేకము ఇత్యాది కార్యక్రమం నిర్వహించిన పిదప మధ్యాహ్నం బస్టాండ్ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్,సభ్యులు మహిళా సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అంజన్న దీక్షల భక్తి పారవశం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఏప్రిల్ 24 :** గ్రామ గ్రామానా భక్తిపార వశం లో భక్తులు ఉంటున్నారు. కమాన్ మండలంలోని ప్రతి గ్రామంలో ఆంజనేయ స్వామి దీక్షలను చేపట్టడం జరిగింది. దీక్షలో ఉన్న ఏం స్నానం చేసి పాలు తాగిన అనంతరం మధ్యాహ్నం బిక్ష చేసి సాయంత్రం అల్పాహారం తీసుకుంటారు. గ్రామాల్లో రామనామ స్మరణతో మార్గోగిపోతోంది. మండలం లోని గుండారం, రాజాపూర్, జూలపల్లి, పెంచికల పేట, రొంపి కుంట, కమాన్ పూర్, నాగారం, దళితర గ్రామాల్లో గత వారం రోజుల క్రితం భక్తులు అంజన మాల లు వేసుకున్నారు. కొందరు 40 రోజులపాటు, మరికొందరు 21 రోజులపాటు, కొందరు 11 గంటలపాటు మాలధారణ వేశారు. మే నెల 13న మాల విరమణ చేయనున్నారు.సాయంత్రం వేళ భజనలతో ఆలయాలు రామ నామస్మరణతో మార్మోగిపోతున్నాయి. గ్రామ గ్రామాన కాశయం వెల్లి విరుస్తోంది.

# జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా సుదమల్ల శ్రీనివాస్ నియామకం

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 24 :** రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్‌గా మొదటగా బాధ్యతలు స్వీకరించి మరోసారి ప్రమోషన్ పొంది ఆర్మే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ రైట్స్ అండ్ హ్యూమన్ రైట్స్ రాజన్న సిరిసిల్ల జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన సుదమల్ల శ్రీనివాస్‌ని నియమిస్తున్నట్లు ఆర్మే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫౌండర్ సయ్యద్ అబ్దుల్ కరీం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామకం 2026 మే నెల నుండి 2029 ఏప్రిల్ వరకు చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు.సుదమల్ల శ్రీనివాస్ గతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ఆపదలో ఉన్నవారికి నేను ఉన్నానని భరోసా ఇచ్చి వారిని ఆదుకు





న్నారు మండల కేంద్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి పలువురి అభినందనలు పొందారు సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ గా ఎదిగి ప్రస్తుతం ఆర్మే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ రైట్స్ అండ్ హ్యూమన్ రైట్స్ డిప్యూటీ డైరెక్టర్గా పదవి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పలువురు అధికారులు నాయకులు శ్రీనివాస్ కి అభినందనలు తెలిపారు.ఆర్మే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ యూత్ జనరల్ సెక్రెటరీగా మారుపాక హరీష్ నియామకం.రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంబేద్కర్ వాదనను వినిపిస్తూ,పూలే అంబేద్కర్ వాదులను ఏకం చేస్తూ, మహనీయుల ఆశయసాధన కోసం పనిచేస్తున్న హరీష్ గారు "మహాత్మా పూలే అంబేద్కర్ రైట్స్ ఫోరంనిస్థాపించి సమ సమాజ స్థాపన కోసం పని చేస్తున్నారు.దీనిని గమనించి మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన ఆర్మే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ యాజమాన్యం 'స్టేట్ యూత్ జనరల్ సెక్రటరీ'గా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన మారుపాక హరీష్ గారిని నియమించి,నియామక పత్రాన్ని అందజేశారు.పదవి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గ్రామంలో ని మిత్రులు,ప్రజా ప్రతినిధులు హరీష్ కి అభినందనలు తెలియజేశారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 24 :** రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకో వాలని ఏఎంసి ఛైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు.శుక్రవారం మండలంలోని ఆత్మకూరు, ఆత్మనగర్,ఏఎస్ ఆర్ తండా,మెట్లచిట్టాపూర్, మేడిపల్లి, సత్తక్కపల్లి గ్రామాలలో తహశీల్దార్ నీతాతో కలిసి ఛైర్మన్ కూన గోవర్ధన్ ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఛైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగిం చుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని వరి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ ఏ గ్రేడ్ కు 2389 కామన్ గ్రేడ్ ధర 2369 ఉందని సెంటర్ నిర్వాకులు నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేయాలని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.ఇట్టి కార్యక్రమంలో సర్పంచులు చిట్యాల రాజారాం, చిలివేరి విజయ,హావవత్ రాజు,సుంకేట అరుణ,కందారి రాజేష్,మిట్టపల్లి మహేందర్, ఉపసర్పంచులు,ఏఎంసి డైరెక్టర్ లింగారెడ్డి,ఆర్ఐ ఉమేష్,సిసిలు సూరయ్య, అశోక్,సురేఖ,వెంకటరమణ, ఏఈఓ భూమేశ్వర్, జిపిఓలు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## సూర్య ధన్వంతరి దేవాలయంలో
# కుంకుమ పూజలు



**జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 24 :** జగిత్యాల పట్టణ చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో వైశాఖ మాసం,శుక్ల పక్షం,శుక్రవారం అష్టమి పర్వదినం పురస్కరించుకొని మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన,లలితా సహస్రనామాల స్తోత్ర పారాయణం చేశారు.పారా యణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడిబియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వారా ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం,అమ్మ వారి ప్రసాదం,తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహూకరించడం జరిగిందని, తదనంతరం అమ్మ వారికి ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ వద్దగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొద్నాల లత,వద్దగట్ట స్వాతి, భారతాల గీత, హర్షిణి, గంగవ్వ, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**-ట్రాకర్ సీజ్,రిమాండ్‌కు తరలింపు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 24 :** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సింగారం గ్రామానికి చెందిన సంపంగి బాబు అనే ట్రాక్టర్ డ్రైవర్ ను శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై కే.రాహుల్ రెడ్డి తెలిపారు.కేసు నమోదు చేసిన అనంతరం సిరిసిల్ల కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా మేజిస్ట్రేట్ సంపంగి బాబు కు 14 రోజుల జ్యుడిషల్ రిమాండ్ విధించి నట్లు ఎస్ ఐ తెలిపారు.ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమం



గా ఇసుక రవాణా చేసినట్లయితే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కే రాహుల్ రెడ్డి హెచ్చరించినారు.



## చిన్నారులకు బాలఅమృతం తినిపించాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఏప్రిల్ 24 :** చిన్నారులకు బాలామృతం తినిపించాలి అని రొంపి కుంట గ్రామ సర్పంచ్ ఉమ్మడి శ్రీనివాస అన్నారు. శు క్రవారం రొంపి కుంట అంగన్వాడి కేంద్రం లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లలో ప్రతి మహిళ వెళ్లి పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలని అన్నారు. చిన్నారులకు ప్రతినిత్యం పౌష్టికాహారం తినిపించాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. గ్రాడ్యుయేషన్ షీల్డ్ లను చిన్నారులకు సర్పంచ్ శ్రీనివాస్ ఉప సర్పంచ్ శ్యాంసుందర్ గౌడ్ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు గుమ్మడి శారద, లక్ష్మి, రజియా తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ లాలాను సన్మానించిన ఏజిపి పసుల కృష్ణ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 24 :** హ్యూమన్ రైట్స్ స్టేట్ డిప్యూటీ చైర్మన్‌గా నియమితులులైన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ లాలా ను ఏజిపి పసుల కృష్ణ తన కార్యాలయంలో శుక్రవారం శాలువలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి గుంటపల్లి చెరువు తండా సర్పంచ్ పుణ్యానాయక్ తదితరులు పాల్గొని అభినందించారు.

## అగ్నిప్రమాదంతో పూరి గుడిసె దగ్ధం



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 24 :** ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో రాజారం గ్రామానికి చెందిన గుర్రం గంగాధర్ పూరీ గుడిసె అగ్నిప్రమాదంతో దగ్గమైంది. గంగాధర్ కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రికి వెళ్లగా ప్రమాదవశాత్తు నిప్పు పట్టుకొని పూరి గుడిసె కాలిపోయింది. సుమారు లక్ష వరకు ఆస్తి నష్టం జరుగగా, ఇంట్లో విలువైన వస్తువులతో పాటు నగదు భూమి పట్టా పాస్ పుస్తకాలు ఇతర పత్రాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గంగాధర్ కోరారు.



# మూగబోయిన ధర్మపురి కంఠం.. నిశ్శబ్దమైన సంగీత యజ్ఞం

**-ధర్మపురి గాన గంధర్వం.. ఇక స్మృతి కావ్యం**

**-ధర్మపురి గాన గంధర్వుడు: సంగీత యజ్ఞంలో పునీతమైన గుండి శంకర్ జీవన ప్రస్థానం**

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

ధర్మపురి పుణ్యక్షేత్రం కేవలం ప్రాచీన ఆలయాలకే కాదు, అపురూపమైన కళా సంపదకు,పండిత ప్రకాండులకు పుట్టినిల్లు.అట్టి పవిత్ర భూమిపై సంగీతాన్ని శ్వాసగా, భక్తిని జీవన పరమార్థంగా మలచుకున్న కమ్మని గానగంధర్వుడి గొంతు మూగబోవడం ఆ క్షేత్ర సాంస్కృతిక చరిత్రలో ఒక తీరని శూన్యం. సాధారణంగా మనుషులు మరణిస్తే భౌతిక కాయం మాయమవుతుంది, కానీ గుండి శంకర్ సార్ వంటి కళాకారులు నిష్క్రమిస్తే ఒక అద్భుతమైన స్వర ప్రపంచమే మూగబోతుంది.ఆయన మరణం కేవలం ఒక వ్యక్తి భౌతిక నిష్క్రమణ కాదు; అది ఒక సాంస్కృతిక శకం ముగింపు, ఒక గాన వైభవం అంతర్ధానం.ధర్మపురి క్షేత్రం కన్న అపర ఘంటసాల,సంగీత సాహిత్య శిఖరం,ఆదర్శ ఉపాధ్యాయులు దివంగత గుండి శంకర్ సార్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు.శంకర్ సార్ జీవితం ఒక సాదాసీదా ఉపాధ్యాయుని వృత్తికి పరిమితం కాలేదు.అది నిరంతరాయంగా సాగిన ఒక అద్భుతమైన సాంస్కృతిక యజ్ఞం.సంగీతాన్ని కేవలం వినోద సాధనంగా కాకుండా, భగవంతుడిని చేరుకునే ఆధ్యాత్మిక సోపానంగా ఆయన భావించారు. చిన్ననాటి నుంచే సంగీతం పట్ల ఆయన పెంచుకున్న అనురక్తి,కటిక పేదరికాన్ని, జీవితం విసిరిన సవాళ్లను ఎదుర్కొని నిలబడేలా చేసింది.మరణాన్ని సైతం సవాల్‌గా స్వీకరించి,అనారోగ్య సమస్యలను అధిగమించి తిరిగి గాత్రం ఎత్తిన ఆయన పోరాట పటిమ ఒక యోధుడిని తలపిస్తుంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఘంటసాల సినిమా పాటల పోటీలలో బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడం,నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర్ రావు లాంటి ప్రముఖుల చేతులు మీదుగా అవార్డులు అందుకోవడం,సన్మానితులు కావడం ఆయన ప్రతిభకు మకుటాయమానమై నిలిచింది.ఆనాడు ఆయన సాధించిన విజయం ధర్మపురి కీర్తి కిరీటంలో మరో మణిపూసగా మారింది.ఆయన పాడుతుంటే శ్రోతలు కేవలం శబ్దాలను వినలేదు,ఆ పదాల వెనుక ఉన్న భావాన్ని,ఆ రాగం వెనుక ఉన్న భక్తిని అనుభూతి చెందారు. అందుకే "పాట అంటే శంకర్ సార్.. శంకర్ సార్ అంటే పాట"అనే నానుడి ధర్మపురిలో స్థిరపడిపోయింది.సాహిత్య సేవలో శంకర్‌సార్ ముద్ర అజరామరం.ముఖ్యంగా ధర్మపురి వాసి, భక్త కవి శేషప్ప రాసిన 'నరసింహ శతకాన్ని'సామాన్య ప్రజానీకానికి చేరవేయడంలో ఆయన పాత్ర అనన్యసాన్యం.గుండి జగదీశ్వర్ శర్మ గారితో కలిసి ఆయన ఆ పద్యాలను ఆలపించి, సీడీల రూపంలో భక్తులకు అందించడం ద్వారా భక్తి సాహిత్యానికి నూతన జవజీవాలు పోశారు. శేషప్ప త్రిశతక పద్యాలను తనదైన శైలిలో, స్పష్టమైన ఉచ్చారణతో,రాగయుక్తంగా గానం చేసి,పద్య కళకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చారు. పద్యం చదవడమే కాదు,ఆ పద్యంలోని అంతరార్థం శ్రోతల హృదయాల్లోకి నేరుగా చొచ్చుకుపోయేలా చేయడంలో ఆయనది అందెవేసిన చేయి.ఒక ఉపాధ్యాయునిగా శంకర్ సార్ పోషించిన పాత్ర అత్యున్నతమైనది. నేరేళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కేవలం పాఠాలు మాత్రమే కాకుండా, సంగీతాన్ని ఒక జీవన విద్యగా బోధించారు. ఆయన వద్ద శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటడమే కాకుండా, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవరచుకున్నారు.విద్యార్థులపై ఆయన చూపిన వాత్సల్యం,వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఆయన పడిన తపన అద్వితీయం.కేవలం పాఠశాలకే పరిమితం కాకుండా, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ నాట్య మండలి ద్వారా పౌరాణిక నాటక రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. నటులకు రాగయుక్తంగా పద్యాలు నేర్పడం,ఎక్కడ లయ తప్పుతుందో గమనించి వెంటనే సరిదిద్దడం ఆయన లోతైన సంగీత జ్ఞానానికి నిదర్శనం. భక్తి,భావం,లయ ఈ మూడింటిని సమ్మిళితం చేస్తూ ఆయన చేసిన స్వర రచనలు కళాకారులకు దిక్సూచిగా నిలిచాయి.శంకర్ సార్ వ్యక్తిత్వం హిమాలయం అంతటి ఉన్నతమైనది. కళాకారులలో సహజంగా ఉండే స్పర్ధలకు భిన్నంగా, తనకంటే ఎవరు బాగా పాడినా మనసారా అభినందించే గొప్ప సంస్కారం ఆయనది. ఇతరుల ఎదుగుదలను చూసి మురిసిపోయే అరుదైన గుణం ఆయనను ఒక మహానుభావుడిగా తీర్చిదిద్దింది. సామాజికంగా కూడా ఆయన ఒక ఉత్ప్రేరక శక్తిగా ఉండేవారు.భజనలు, పూజలు లేదా ఊరి ఉత్సవాలు ఏవైనా సరే, అందరినీ ఏకోన్ముఖులను చేసి నడిపించేవారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం దైవ చింతనకే వినియోగించి, ప్రతిరోజూ వాట్సాప్ సమూహాలలో శ్లోకాలు, పద్యాలు పంపిస్తూ ఇళ్లల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపేవారు. నేడు ఆ గ్రూపులు నిశ్శబ్దమైపోయాయి అంటే, అది కేవలం ఒక గొంతు మూగబోవడం వల్ల కాదు, ఒక చైతన్య రథం ఆగిపోవడం వల్ల కలిగిన వేదన.జీవితాంతం సంగీత సాధననే తపస్సుగా భావించిన శంకర్ సార్, పదవుల కోసం, ప్రాచుర్యం కోసం ఎన్నడూ ప్రాకులాడలేదు. తన చివరి శ్వాస వరకు సంగీత సేవనే ధ్యేయంగా బతికారు. ఆయన మరణం ధర్మపురి సాంస్కృతిక చరిత్రలో ఒక పెద్ద చీకటి రోజు.పవిత్ర గోదావరి తీరాన వినిపించే నరసింహ నామ స్మరణలో,శేషప్ప పద్యాల ప్రతిధ్వనిలో శంకర్‌సార్ గాత్రం ఎప్పటికీ సజీవంగానే ఉంటుంది. ఆయన భౌతికంగా లేకపోయినా, ఆయన పంచిన సంగీత సుధలు, ఆయన తీర్చిదిద్దిన శిష్య పరంపర ఆయన వారసత్వాన్ని ముందు తరాలకు తీసుకెళ్తాయి. అపర ఘంటసాలగా, గాన గంధర్వుడిగా శంకర్ సార్ పేరు ధర్మపురి గాలిలో, నేలలో, మనుషుల గుండెల్లో శాశ్వతంగా లిఖించబడింది. ఆయన ఆత్మకు సద్గతి కలగాలని ఆ లక్ష్మీనరసింహ స్వామిని ప్రార్థిస్తూ.. ఆయన సంగీత ప్రయాణం అనంత లోకాల్లోనూ ఇట్లే కొనసాగాలని కోరుకుందాం.





# లిటిల్ పెబ్ల్ పాఠశాల వార్షికోత్సవం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 24 :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని లిటిల్ పెబ్ల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే మరియు వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రిన్సిపల్ పద్మావతి చైతన్య కృష్ణ  అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా మండల విద్యా అధికారి (ఎంఈఓ) కొమరయ్య,మాజీ జెడ్పిటిసి గంట రమణారెడ్డి,విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఇజ్జగిరి సాకేత్  హాజరై విద్యార్థులను అభినందిం చారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రు లు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎజెండాను నిబంధనలకు అనుగుణంగా అందించాలి



**చురకలు విలేకరి,జగిత్యాల,ఏప్రిల్ 24 :** మున్సిపల్ సమావేశ ఎజెండాను నిబంధనలకు అనుగుణంగా అందించాలని కౌన్సిలర్ మూలస్థం లావణ్య అన్నారు. శుక్రవారం జరిగిన మున్సిపల్ సర్వసభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగిత్యాల మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడిన నూతన కార్యవర్గంలో 29 మంది కొత్తగా ఎంపికైన సభ్యులు ఉన్నారని తెలిపారు. మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి కనీసం 7 రోజుల ముందు, సాధారణ సమావేశానికి 3 రోజుల ముందు ఎజెండాను అందించాల్సి ఉండగా, కేవలం ఒక రోజు ముందు మధ్యాహ్నం ఇవ్వడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని చైర్పర్సన్ మరియు కమిషనర్ గారిని కోరారు. కోర్టు కేసులకు సంబంధించి ఫీజులు చెల్లించడం మాత్రమే కాకుండా, ఆ కేసుల పూర్తి వివరాలను ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. తద్వారా ప్రజలు అడిగే ప్రశ్నలకు సమగ్రంగా సమాధానాలు ఇవ్వగలమన్నారు. ఆటోలకు మైక్ సెట్లు కొనుగోలు ప్రక్రియలో పూర్తి నిబంధనలు పాటిస్తూ, నాణ్యమైన మరియు మన్నికైన సామగ్రిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు.

# ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ.జానకి షర్మిల




**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఏప్రిల్, 24 :** ఈరోజు భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# బిఆర్ఎస్ నాయకుని జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఏప్రిల్ 24 :** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన టిఆర్ఎస్ నాయకుని పుట్టినరోజు వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల బి ఆర్ ఎస్ కమాన్ పూర్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్, టిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, మాజీ సర్పంచ్ కొండా వెంకటేష్, నాయకులు గుర్రం లక్ష్మి మల్లు, పల్లె నారాయణ , సాన సురేష్ కుర్మా తదితరులు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# డంపింగ్ యార్డ్ రద్దు కోసం కొనసాగుతున్న దీక్షలు

**-ఒకరోజు దీక్షలో పాల్గొన్న పీవీ సేవాసమితి, లయన్స్ క్లబ్ సభ్యులు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 24 :** హుజురాబాద్ మండలం సిరిసపల్లి సమీపంలో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలో భాగంగా శుక్రవారం స్థానిక పివి సేవాసమితి,లయన్స్ క్లబ్ సభ్యులు ఒకరోజు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా పి వీ సేవా సమితి అధ్యక్షుడు తూముల వెంకట్ రెడ్డి, మనోజ్, సాగి శివప్రసాదరావు, బెల్లి రాజయ్య, మార్త రవీందర్, పోల్సాని రామారావు, సదానందం తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ నిర్మాణంతో హుజురాబాద్ ప్రాధాన్యత దెబ్బతింటుందని, భవిష్యత్తులో ప్రజలు ఇక్కడ ఇళ్లు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ప్రజలు రోగాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణం దెబ్బతింటుందని, సీడ్ బౌల్ గా ఉన్న హుజురాబాద్.. అతిపెద్ద కాలుష్య కేంద్రంగా మారుతుందని రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఇంకా ఉండదని అన్నారు. ఇప్పటికి నెల రోజులు దాటిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని.. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన చేసి ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించాలని డిమాండ్ చేశారు.

# కన్నతండ్రిని పోషించని కర్కష కొడుకులు

**చురకలు ప్రతినిధి,జగిత్యాల ఎప్రిల్ 24 :** తన కొడుకులు సత్తయ్య, శేఖర్ లు పోషించడం లేదని జిల్లా లోని బీర్పూర్ మండలం కమ్మునూర్ గ్రామానికి చెందిన తోట భూమరాజం అనే వృద్ధుడు (76) జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు. కాగా ఆ వృద్ధుడు శుక్రవారం సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో విలేకరుల కు తన గోడు వినిపించారు. తన పెద్ద కొడుకు సత్తయ్య నాకు సంబందించిన 5ఎకరాల



14 గుంటలు బలవంతంగా పట్టా చేయించు కున్నాడని, మరో 1ఎకరం 9 గుంటలు నా పెద్ద కొడుకు అతని బిడ్డల పేరిట పట్టా చేయించు కున్నప్పటికీ పెద్ద కొడుకుతో పాటు చిన్న కొడుకు శేఖర్ లు నన్ను పోషించక పోవడంతో అనారోగ్యంతో, కన్నులు కూడ సరిగా కనపడక తినడానికి తిండి లేక పలు ఇబ్బందులు పడుతున్నానని రోధించాడు. అనంతరం ఆ వృద్ధుడిని హరి అశోక్ కుమార్ తీసుకెళ్లి ఆర్డీవో మధుసూదన్ కు ఫిర్యాదు చేయగా ఆ వృద్ధుని కేసులో ఇదివరకే వయో వృద్ధులు సంరక్షణ చట్టం కింద ఇచ్చిన ఉత్తర్వులు పాటించని కొడుకులకు తీర్పు ఉల్లంఘన కింద 6నెలల జైలు శిక్ష విధింపునకు కేసు నమోదు చేశారు. వృద్ధుడి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, సంఘ ప్రతి నిధులు గౌరి శెట్టి విశ్వనాతం, వెల్ముల ప్రకాష్ రావు తదితరులున్నారు.

# రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రిడిటేషన్ల జారీకి కుట్ర

**-జీవో 252 బుట్ట దాఖలు చేస్తున్న సమాచార శాఖ**

**-పెద్ద పత్రికలకు ఉదారత చిన్న పత్రికలపై వేటు**

**-జీవో ఇష్టం వచ్చినట్లు మార్చే అధికారం ఎవరిచ్చారు?**

**-జీవో ప్రకారం అక్రిడిటేషన్లు ఇవ్వకపోతే న్యాయపోరాటం తప్పదు**

**-డబ్ల్యూజేఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్**




**చురకలు ప్రతినిధి,కరీంనగర్, ఏప్రిల్, 24 :** రాష్ట్రంలో జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ పూర్తి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అక్రిడిటేషన్ల జారీకి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252 అపహాస్యం పాలవుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సంఘానికి సంబంధించిన నేతల ఒత్తిళ్లకు తలవొగ్గిన సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు సాక్షాత్తు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తుంగలో తొక్కడం ఎంత మేరకు సమర్థనీయం కాదన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం జారీ చేసే అక్రిడిటేషన్లకు సంబంధించి జరిపిన సమావేశాలలో ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా నిర్ణయాలు జరిగాయని, జీవోకు విరుద్ధంగా జారీ చేసే అక్రిడిటేషన్ల ప్రక్రియను అడ్డుకొని తీరుతామని ఆయన హెచ్చరించారు. అక్రిడిటేషన్ జీవో కచ్చితంగా అమలు చేయాల్సి ఉండగా,అందులో మార్పులు చేర్పులు చేసే అవకాశం, అధికారం రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్ కమిటీకి, సమాచార శాఖ కమిషనర్ కు, మీడియా అకాడమీ చైర్మన్ కు లేదని కరుణాకర్ స్పష్టం చేశారు. అలా మార్పులు చేసే అవకాశం లేనప్పుడు రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో జీవో కు విరుద్ధంగా నిర్ణయాలు ఎందుకు జరిగాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల ప్రక్రియ జీవో ఎంఎస్ 252 ఆధారంగానే జరుగుతున్నదా? అలా అయితే, ఏబీసీ/ పీఆర్జీఐ/ ఆర్ఎన్ఐ ఆమోదిత సర్క్యులేషన్ సర్టిఫికేట్లు లేని పెద్ద మధ్యతరహా వార్తాపత్రికలకు అక్రిడిటేషన్లు ఎలా మంజూరు చేయబడుతున్నాయని, దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత సమాచార శాఖ అధికారులపైనే ఉందన్నారు. జీవో ఎంఎస్ 252లో పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం, పెద్ద పత్రికల కేటగిరి లోని దినపత్రికలు ఏబీసీ/ పీఆర్జీఐ/ ఆర్ఎన్ఐ సర్క్యులేషన్ సర్టిఫికేట్ సమర్పించకపోతే, ఏ ప్రాతిపదికన వాటికి అక్రిడిటేషన్లు ఇవ్వబడుతున్నాయో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద,మధ్యతరహా వార్తాపత్రికలతో పోలిస్తే చాలా తక్కువగా అక్రిడిటేషన్లు పొందుతున్న చిన్న వార్తాపత్రికలకు మాత్రమే సదరు జీవోను వర్తింప చేయడం చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం చేసినట్లేనని ఆయన అన్నారు. జీవో ఎంఎస్ 252లో పేర్కొన్న విధంగా సర్క్యులేషన్ 25000 కంటే ఎక్కువ ఉంటే ఏబీసీ/పీజీఆర్ఐ/ఆర్ఎన్ఐ ఆమోదిత ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. సదరు జీవోను ఉల్లంఘిస్తూ, అక్రిడిటేషన్ కమిటీ పెద్ద మరియు మధ్య తరహా వార్తాపత్రికలకు అక్రిడిటేషన్లను ఆమోదించినట్టుగా తమకు సమాచారం ఉందన్నారు. జీవో ఎంఎస్ 252ను ఉల్లంఘించి, దానికి వ్యతిరేకంగా ఆమోదాలు ఇచ్చే అధికారం అక్రిడిటేషన్ కమిటీకి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. జీవో ఎంఎస్ 252లో పేర్కొన్న విధంగా సర్క్యులేషన్ సర్టిఫికేట్‌ను ధృవీకరించుకోకుండా, పెద్ద మరియు మధ్యతరహా వార్తాపత్రికలకు ఏ ప్రాతిపదికన అక్రిడిటేషన్ ఇస్తున్నారని ప్రశ్నించారు. కొన్ని పెద్ద,మధ్యతరహా వార్తాపత్రికలు డీఏవీపీ/సీబీసీలో అతి తక్కువ సర్క్యులేషన్‌ను చూపిస్తూ, సమాచార శాఖలో మాత్రం ప్రకటనల రేట్లు, అక్రిడిటేషన్ ప్రయోజనాల కోసం అంతకు పెద్ద సంఖ్యలో సర్క్యులేషన్ వివరాలు చూపిస్తున్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఏజెన్సీలకు వేర్వేరు సర్క్యులేషన్‌ను చూపిస్తూ మోసం చేస్తున్న పత్రికల విషయంలో సమాచార శాఖ నిబంధనలు ఎందుకు పాటించడం లేదని ఆయన అన్నారు.

## గ్రామ సభల ద్వారా
# రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి



**-జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత**

**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 24 :** గ్రామ సభల ద్వారా రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా శుక్రవారం ధర్మపురి మండలంలోని గాదె పెల్లి గ్రామాల్లో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహన సదస్సును నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిధిలో వున్నా సర్వే, హద్దులు,చట్టం 1923 గురించి మరియు సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి గ్రామ సభలో గాదెపెల్లి గ్రామాల రైతులకు మరియు గ్రామప్రజలకు అవగాహణ కల్పించారు .ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సర్వే, భూమి కొలతల అధికారి, ధర్మపురి తహాశీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్,సర్పంచ్ అల్పట్ల సురేష్, మండల సర్వేయర్, మండల గిర్దావర్-1, ఆర్ఐలు, స్థానిక పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత జిపివోలు, స్థానిక సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పాలన అధికారి, నూతనంగా అనుమతి పొందిన సర్వేయర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ గౌడ్‌ది ప్రభుత్వ హత్యే

**-ఆర్టీసీని ప్రభుత్వం నాశనం చేస్తోంది**

**-హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 24 :** నర్సంపేట ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదని..ప్రభుత్వ హత్యనని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్న బాధతోనే తన ఆత్మ హత్యతోనైనా ప్రభుత్వం స్పందిస్తుందని ఆవేదనతో మండుటెండలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని శంకర్‌గౌడ్ నిప్పంటించుకున్నాడని అన్నారు. కార్మికులు ఎవరు తొందరపడొద్దని వారికి అండగా తమ పార్టీ కెసిఆర్ ఉంటారని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆర్టీసీని నాశనం చేస్తుందని, కార్మికులతో వెట్టి చాకిరీ చేయించు కుంటూ వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే ఆలోచన ప్రభుత్వం చేస్తుందని, దీన్ని తప్పకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు కార్మిక యూనియన్లు వినతి పత్రాలు సమర్పించినా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. సంస్థ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న కార్మికుల హక్కులను కాలరాయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో విద్యార్థులు మహిళలు వృద్దులు ఆసుపత్రులకు వెళ్లేవారు పరీక్షలు రాసేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? లేదా? అని అనుమానం కలుగుతోందని అన్నారు. కార్మికులకు అండగా తాము వుంటామని ఆయన అన్నారు.

